# మహారాష్ట్ర | ద్రోణగిరిలో కాంకర్ కార్మికుల ఆందోళన

**కంటైనర్** కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (కాంకర్) అనేది రైల్వేశాఖకు చెందిన ప్రభుత్వరంగ కంపెనీ. భారీ కంటైనర్ల ద్వారా ఎగుమతులు, దిగుమతులను ఈ కంపెనీ నిర్వహిస్తుంది. మహారాష్ట్ర రాయఘర్ జిల్లా- ద్రోణగిరిలో దీని స్థావరం వుంది. ఆ కారణంచేత దీనిని ద్రోణగిరి రైల్ టెర్మినల్ (డిఆర్‌టి) అని కూడా పిలుస్తారు. ఈ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు వివిధ కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో నిరంతరాయంగా పనిచేస్తూ వస్తున్నారు. ఇప్పటికి అనేకమంది కాంట్రాక్టర్లు మారారు. అయినా కార్మికులను మార్చకుండా కొనసాగించటమనేది కార్మికుల దృఢమైన ఐక్యతతోనే సాధ్యమైంది. కాంట్రాక్టరు మారినప్పుడల్లా, పాత కార్మికులను తొలగించేందుకు, నూతన కార్మికులను తక్కువ వేతనంపై నియమించుకునేందుకు అతను ప్రయత్నం చేస్తాడు. అందువలన, దానిని అడ్డుకునేందుకు ప్రతిసారీ సంఘర్షణ, ఆందోళన అవసరమౌతుంది.

2023 ఏప్రిల్ 4వ తేదీన కాంకర్ సంస్థ తమ అధీనంలో ఓ యంత్రాన్ని తొలగించి, అద్దె ప్రాతిపదికన మరో యంత్రాన్ని తెచ్చిపెట్టుకోవాలని చూసింది. ఈ కొత్తయంత్రంపై తమకు పని లభిస్తుందనే గ్యారంటీ నివ్వవలసిందిగా కార్మికులు ప్రశ్నించినపుడు, కాంకర్ యాజమాన్యం స్పందించలేదు. కనుక, కార్మికులు తాము పనిచేసే పాత యంత్రాన్ని పని ప్రదేశం నుండి తరలించటానికి అంగీకరించలేదు. దీనితో నూతనంగా తీసుకొచ్చే యంత్రంపై కార్మికులకు పని కల్పిస్తామని కాంకర్ యాజమాన్యం కార్మికులకు హామీ నివ్వటంతో, కార్మికులు తమ పాత యంత్రాన్ని బయటకు పంపేందుకు అంగీకరించారు. యాజమాన్యం తమ హామీపై నిలబడకుండా కొత్తగా తెచ్చిన యంత్రంపై పాత కార్మికులను పనిచేయనీయకుండా, ప్రత్యేకించి ఆ యంత్రం కోసం ఇద్దరు కార్మికులను పనిలోకి తీసుకొచ్చారు.

ఈ చర్యతో, తమ ఉద్యోగాలు క్రమంగా ప్రమాదంలో పడబోతున్నాయని కార్మికులకు స్పష్టమైంది. కార్మికులంతా ఈ సమస్యపై సమావేశమై, మిగిలిన అన్ని యంత్రాలను పనిచేయకుండా ఆపివేసి తమ నిరసన తెలియజేశారు. ఫలితంగా, మొత్తం పని అంతా ఆగిపోయింది. అరగంట సమయం మాత్రమే యంత్రాలన్నింటినీ నిలిపి వుంచారు. దీనితో దిగివచ్చిన కాంకర్ యాజమాన్యం కార్మికులతో చర్చలు జరిపింది. నూతనంగా తీసుకొచ్చిన యంత్రాన్ని పనిచేయకుండా నిలిపివుంచే షరతుపై, మిగిలిన యంత్రాలను పనిచేయించటానికి కార్మికులు అంగీకారం తెలిపారు. నూతన యంత్రాన్ని నూతన కార్మికులచేత ప్రారంభించే ప్రయత్నంచేస్తే, మరల పనులు అన్నింటినీ స్థంభింపజేయాలని కార్మికులు నిర్ణయించుకున్నారు. నాలుగు రోజుల సంఘర్షణ, ఉద్రిక్త పరిస్థితుల తర్వాత, అంతిమంగా గత 12 సం॥లుగా సంస్థలో పనిచేస్తున్న కార్మికులే, ఈ నూతన యంత్రంపై కూడా పనిచేసే విధంగా యాజమాన్యం అంగీకరించింది. ఒక వారం రోజుల తర్వాత ఇప్పుడు కార్మికులంతా ఉపశమనం పొందామని సంతోషంగా వున్నారు. ఈ సంఘర్షణ, సంభాషణలు జరిపే క్రమం వంటివన్నీ కార్మికుల ఐక్యతా బలంపై ఆధారపడే సాధ్యమయ్యాయి. విద్వేషం, మతతత్వాలు దేశంలో ఎల్లెడలా వ్యాప్తి జరుగుతున్న నేటి దేశ పరిస్థితుల్లో కేవలం కార్మికుల ఐక్యత మాత్రమే దానిని నిరోధించగలుగుతుంది.

* * * * *